సుందరేశ్వర్రావు ఎ జి ఆఫీసులో ఆడిటర్‌గా పనిచేస్తున్నాడు. అతని తోడల్లుడు కామేశ్వర్రావు కూడా హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసరుగా ఉద్యోగం చేస్తున్నాడు. అయితే వాళ్లిద్దరూ ఒకేచోట ఉండటంలేదు. సుందరేశ్వర్రావు చిక్కడపల్లిలోనూ, కామేశ్వర్రావు మల్లేపల్లిలోనూ అద్దె గృహాల్లో వుంటున్నారు. సుందరేశ్వర్రావు భార్య జానకి, కామేశ్వర్రావు భార్య భారతీ స్వయాన అక్కచెల్లెళ్లు కాబట్టి తరుచూ ఒకళ్లయింటికి మరొకళ్లు వస్తూ పోతూ వుంటారు తోడల్లుళ్లు కూడా కల్సుకొంటూనే వుంటారు. ప్రత్యేకం సెలవు దినాల్లో ఒకరి కుటుంబాన్ని మరొకరు భోజనాలకు పిల్చుకోవడం పరిపాటి.

సుందరేశ్వర్రావు ఉదయం తొమ్మిదిన్నరకు ఇల్లు వొదిలితే రాత్రికి ఎప్పుడు ఇంటికి వస్తాడో తెలియదు మొదట్లో ఆఫీసులో పనివుందనీ, ఫ్రెండ్స్‌తో సినిమా కెళ్ళాననీ ఎన్నోవిధాల సాకులు చెబుతూ వచ్చాడు. కొంత కాలంపాటు జానకి నమ్మింది గానీ, ఆపైన భర్త ప్రవర్తనపై అనేక అనుమానాల్ని పెంచుకొని, ఓరోజు నిగ్గదీసి నిలువునా ధూపంవేసినట్టు అడిగింది.

సుందరేశ్వర్రావుకు నిజం చెప్పక తప్పలేదు.

"రోజూ సాయంత్రాలు క్లబ్బుకు పోతున్నాను."

"ఎందుకు?"

"పేకాట ఆడటానికి."

"అంతేనా ? విస్కీకూడా తాగుతున్నారా?"

"అబ్బే! లేదు. దేవుడిమీద ఒట్టు," అన్నాడు సుందరేశ్వర్రావు.

మొగుడు క్లబ్బులో రోజూ పేకాడుతున్నాడని జానకి నమ్మింది. అంతే కాకుండా ఆ పేకాటలో డబ్బు సంపాయిస్తున్న దాఖలాలు కూడా కనిపించాయి. ఆమెకు నెలకో చీర కొనిపెట్టసాగాడు. రెండుజతల బంగారు గాజులు చేయించాడు. తాను ఒక స్కూటర్ కొనుక్కున్నాడు. కాని జూదం ఆడటం దురల

వాటనీ, కుటుంబ ఆర్థిక వ్యవస్థకు మంచిది కాదనీ, సప్తవ్యసనాల్లో అదొకటనీ జానకి అభిప్రాయం. మొగుడు తనని సంతోషపెట్టటానికి ఏ వస్తువు కొనిపెట్టినా, ఆమె పూర్తిగా సంతోషపడలేకపోతోంది. పైపెచ్చు ఒకరోజు చెల్లెలు భారతి మొహాన కారపునీళ్లు చల్లినట్టుగా అడిగింది.

"బావగారు రోజూ రాత్రుళ్లు ఆలస్యంగా ఇంటికొస్తారటగా! క్లబ్బులో పేకాట ఆడతారటగా!"

తల కొట్టేసినంత అవమానం వేసింది జానకికి.

"ఎవరు చెప్పారే?"

"మా ఆయన!"

"ఆయనా క్లబ్బు కెళతారా?"

"లేదు. వాళ్ల ఆఫీసులో ఒకాయన చెప్పాడట. ఏమైనా పేకాట మంచిది కాదే! సొమ్ము పోతుంది, ఆరోగ్యం చెడిపోతుంది."

జానకి మాట్లాడలేదు. చెల్లెలిచేత అట్లా చెప్పించుకోవాల్సి వచ్చినందుకు ఎంతో అభిమానపడింది. ఆ అభిమానాన్ని మౌనంద్వారా దిగమింగింది. అయితే ఆ రోజురాత్రి ఒంటిగంట కొచ్చిన భర్తమీద భద్రకాళిలా విరుచుకుపడింది.

సుందరేశ్వర్రావు నోరు కదపకుండా భార్య ఆగ్రహాన్ని భరించాడు. పేకాట మానివేస్తానన్నాడు. కాని మానివేయలేకపోయాడు. భార్య అప్పుడప్పుడూ సూరేకారంలా చిటపటలాడుతున్నా, దున్నపోతుమీద వర్షం కుర్సినట్టు దులప రించుకుపోతున్నాడు.

జానకికి దిగులు పట్టుకుంది. భర్తకు క్లబ్బు అలవాటును ఎట్లా మాన్పించాలా అని ఆలోచించసాగింది.

పుట్టింటికి పోతానని బెదిరించింది.

ఒంటిమీద కిర్సనాయిలు పోసుకుని వంటగదిలో ఆత్మహత్య చేసుకుంటానని భయపెట్టింది.

అయినప్పటికీ సుందరేశ్వర్రావు క్లబ్బుకు వెళ్లడం మానుకోలేదు.

ఒకరోజు ఒక ఫ్రెండ్ బలవంతంమీద మలకపేట రేసుకోర్సు కెళ్లాడు సుందరేశ్వర్రావు. అక్కడ ఒక గుర్రంమీద రెండొందలు పందెంకాస్తున్న తోడల్లుడు కామేశ్వర్రావు కనబడ్డాడు. కాని అతను మొహం చాటుచేసుకున్నాడు

సుందరేశ్వరరావును చూసి, తన మిత్రుణ్ణి అడిగి తెల్సుకున్నాడు - కామేశ్వరరావు తరుచూ రేసుల కొస్తాడని.

అది జరిగిన నాలుగు రోజులకు ఓ రాత్రి కామేశ్వరరావు బ్రాందీ తాగుతూ 'బ్లూ ఫాక్స్'లో కనబడ్డాడు సుందరేశ్వరరావుకు. కాని అతను మొహం పక్కకు తిప్పుకున్నాడు తోడల్లుడ్ని గమనించినట్టు. ఈ రెండు సందర్భాలలో సుందరేశ్వరరావు గ్రహించిందేమిటంటే - తన తోడల్లుడు కామేశ్వరరావుకు రేసులకువెళ్ళే అలవాటువుందనీ; అప్పుడప్పుడూ బ్రాందీతాగుతాడనీ, తోడల్లుడిలో రెండు దురలవాట్లనూ ప్రత్యక్షంగా చూసినమీదట సుందరేశ్వరరావు మహానంద పడిపోయాడు.

ఆ రోజు రాత్రి భార్యతో అన్నాడు.

"మీ చెల్లెలిమొగుడు బుద్ధిమంతుడనీ, ఏ దుర్వ్యసనం ఎరుగడనీ ఆ మధ్య అన్నావు గదా! అతనికీ కొన్ని బలహీనతలున్నాయి. కొన్ని వ్యసనాలున్నాయి. రేసులకు వెడతాడట. బ్రాందీ తాగుతాడట. ఈ తఫా మీ చెల్లెలొస్తే నిజమేనా అని నిలదీసి అడుగు."

జానకి అప్రతిభురాలైంది.

"నిజమా?"

"నాకుతెల్సిన సమాచారం చెప్పాను."

"మీ కెట్లా తెల్సింది?"

"ఫ్రెండ్స్‌ద్వారా కనుక్కున్నాను."

జానకి ఏం మాట్లాడలేకపోయింది.

సుందరేశ్వరరావు విజయగర్వంగా చిరునవ్వు నవ్వాడు.

*తమ తప్పుల్ని కప్పిపుచ్చుకోవా లనుకొనేవాళ్ళు ఇతర్లలో బలహీనతల్ని వెతుకుతారు.*

——